సాక్షి
ఆదిలాబాద్
బుధవారం । 10 । ఏప్రిల్ । 2024



సాంగ్విలో 'హైటెక్' తవ్వకాలు

జైనథ్ మండలం సాంగ్వి గ్రామ సమీపం లోని పెన్‌గంగ నదిలో ఇసుక అక్రమ తవ్వ కాలు జోరుగా సాగుతున్నాయి. హైటెక్ పద్ధతిన ఇసుకను తోడేస్తున్నారు. 8లో▸

రంజాన్ వేళలు

బుధ
ఇఫ్తార్
6:33

గరిష్టం/కనిష్టం
38.0/24.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది. పగటి ఉష్ణోగ్రత కొంత తగ్గనుంది.

న్యూస్‌రీల్

శోభాయాత్ర విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యోగానంద సరస్వతి తదితరులు

ఆదిలాబాద్‌టౌన్: శ్రీరామనవమి సందర్భంగా ఈనెల 17న జిల్లా కేంద్రంలో నిర్వహించ తలపెట్టిన భారీ శోభాయాత్రను విజయవంతం చేయాలని శ్రీరామన వమి ఉత్సవ సమితి అధ్యక్షుడు రాళ్లబండి మహేందర్ కోరారు. జిల్లా కేంద్రంలోని గోపాలకృష్ణ మఠంలో మఠాధిపతి యోగానంద సరస్వతి చేతుల మీదుగా శోభాయాత్ర పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. జిల్లాలోని హిందూ బంధువులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఇందులో సమితి సభ్యులు మహేందర్, సురేందర్, అభియాదవ్, సాయికృష్ణ, శరత్,యతేంద్రనాథ్‌యాదవ్, మనోజ్ పవార్, సాయి, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

టీపీహెచ్ కార్యవర్గం



లోగోను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: తెలంగాణ ప్రజా హక్కుల సాధన సమితి (టీపీహెచ్) ఉద్యమ సంఘం కార్యవర్గాన్ని జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘ భవనంలో మంగళవారం ఎన్నుకున్నారు. రాంజీగోండ్ వర్ధంతి సందర్భంగా ముందుగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం సంఘం లోగోను ఆవిష్కరించారు. కార్యవర్గాన్ని ప్రకటించారు. వ్యవస్థాపక అధ్యక్షుడిగా విజ్జగిరి నారాయణ, ఉపాధ్యక్షులుగా కొత్తపెల్లి సంతోష్, కొడప సోనేరావు, టార్పే తులసి, విజ్జగిరి పుష్ప, ప్రధాన కార్యదర్శిగా కినక సురేశ్, కార్యదర్శులుగా కుమ్ర రాజు, మర్సకోల బాపురావు, కరుణ, సహాయ కార్యదర్శిగా గెడం రాము, కోశాధికారిగా దర్శనాల అశోక్, ప్రచార కార్యదర్శులుగా విజ్జగిరి మనోజ్, కుమ్ర రాజు, సోషల్ మీడియా కార్యదర్శిగా ఇంతియాజ్, అధికార ప్రతినిధిగా నీరటి ఉదయ్ కిరణ్, సభ్యులుగా నిర్మలబాయి, సులోచన, అంకుష్ ఎన్నికైనట్లు వెల్లడించారు.

మహనీయుల బాటలో నడవాలి



నివాళులర్పిస్తున్న నిహారిక, నాయకులు

ఎదులాపురం: మహనీయుల బాటలో నడవడమే వారికి మనం ఇచ్చే గొప్ప నివాళి అని సహాయ గిరిజన అభివృద్ధి అధికారి నిహారిక అన్నారు. టీఏజీఎస్, టీపీవీఎస్, కేవీపీఎస్ ఆధ్వర్యంలో 'ఏప్రిల్ మాసం మహనీయులను స్మరించుకుందాం' అనే కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. రాంజీగోండ్ వర్ధంతి, జ్యోతి బాపూలే జయంతి, అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమానికి టీపీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పూసం సచిన్ అధ్యక్షత వహించారు. ఆ మహనీయుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్, ప్రిన్సిపాల్ లక్ష్మి ప్రసన్న, టీపీవీఎస్ నాయకులు కిష్టన్న, మహేశ్, అర్జున్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జితేందర్, ప్రవీణ్, టీఏజీఎస్ నాయకులు స్వామి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుల నియామకం

కైలాస్‌నగర్: జిల్లాలోని నాలుగు మండలాలకు భారతీయ జనతా పార్టీ కొత్త అధ్యక్షులను నియమించింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ మంగళవారం వివరాలు వెల్లడించారు. గుడిహత్నూర్ మండల అధ్యక్షుడిగా కేంద్రే శివాజీ, బజార్‌హత్నూర్ మండల అధ్యక్షుడిగా పారెడ్డి శ్రీనివాస్, నేరడిగొండ అధ్యక్షుడిగా సాబ్లే సంతోష్ సింగ్, బోథ్ మండల అధ్యక్షుడిగా బొరే రవీందర్‌ను నియమించినట్లుగా పేర్కొన్నారు.

రిమ్స్ వద్ద గల గణేశ్‌మందిర్‌లో భక్తుల సందడి



తెలుగు నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న యోగానంద సరస్వతి



ప్రజాసేవ భవన్‌లో పంచాంగ శ్రవణం చేస్తున్న ప్రవీణ్ శర్మ



వైభవంగా ఉగాది

- 'క్రోధి'కి ఘన స్వాగతం
- ఆలయాల్లో పూజలు.. పంచాంగ శ్రవణాలు
- సాగు పనులకు అన్నదాతలు శ్రీకారం

కైలాస్‌నగర్: తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలను జిల్లావాసులు మంగళవారం వైభవంగా నిర్వహించుకున్నారు. ఇంటింటా తయారు చేసిన షడ్రుచుల పచ్చడితో పాటు బూరెలను ఆరగించారు. శ్రీక్రోధి నామ సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. గ్రామాల్లో వేకువజామునే చేలకు చేరిన అన్నదాతలు ఆరె చెట్టుకు పూజలు చేసి సాగు పనులకు శ్రీకారం చుట్టారు. జిల్లా కేంద్రంలోని శ్రీ రామచంద్ర గోపాలకృష్ణ మఠంలో నిర్వహించిన వేడుకల్లో మఠాధిపతి యోగానంద సరస్వతి చేతుల మీదుగా ఉగాది పచ్చడి, గుడాలు పంపిణీ చేశారు. నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. కైలాస్‌నగర్‌లోని దక్షిణముఖ హనుమాన్ ఆలయంలో చికిలి లక్ష్మీవెంకటేశ్వర శాస్త్రీ పంచాంగ శ్రవణాన్ని పఠించారు. ప్రజాసేవభవన్‌లో కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రవీణ్‌శర్మ పంచాంగ శ్రవణం పఠించారు. బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న పాల్గొని పార్టీశ్రేణులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మరాఠీలు తమ సంస్కృతిని చాటేలా కట్టెకు చెంబు, చీర కట్టి ఇంటిపైన ఎగురవేశారు.



కైలాస్‌నగర్ హన్‌మాన్ ఆలయంలో పంచాంగ శ్రవణం పఠిస్తున్న చికిలి వెంకటేశ్వరశాస్త్రీ



నాగలి కట్టి సాగు పనులకు శ్రీకారం చుడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఉగాది పచ్చడి అందజేస్తున్న జోగు రామన్న



గుడిహత్నూర్‌లో మరాఠాల ఇళ్లపైన కట్టెకు చెంబు, వస్త్రంతో ఇలా..



మౌనం..

- బీజేపీ, కాంగ్రెస్‌లో టికెట్ దక్కని వారి వైఖరి
- పార్టీ ముఖ్య కార్యక్రమాలు, ప్రచారానికి దూరం
- అసంతృప్తా.. వ్యూహాత్మకమా..?

సాక్షి,ఆదిలాబాద్: మరికొద్ది రోజుల్లో పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ రానుంది. ఇప్పటికే ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారైపోయారు. టికెట్ ఆశించి భంగపడ్డ ప్రధాన నేతలను పార్టీ అభ్యర్థి స్వయంగా వెళ్లి కలిసినప్పుడు పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండడమే కాకుండా విజయానికి తోడ్పాటునందిస్తానని భరోసానిచ్చారు. ఆ తర్వాత వారు పార్టీ పరంగా జరిగే ముఖ్య కార్యక్రమాలకు, ప్రచారానికి మాత్రం దూరంగానే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయా పార్టీల్లో ఆ నేతలపై చర్చ సాగుతుంది. మరి అసంతృప్తి కొనసాగుతుందా.. లేనిపక్షంలో వ్యూహాత్మక మౌనమా అని చర్చించుకుంటున్నారు. ఎన్నికల్లో పార్టీ రెబల్‌గా ఎవరైనా బరిలోకి దిగుతారా అనే ఆసక్తి కూడా జనాల్లో లేకపోలేదు.

కమలం పార్టీలో ఇలా..

ప్రధానంగా బీజేపీలో అసంతృప్తుల జాబితా పెద్దగా ఉంది. ఈ పార్టీ నుంచి మరోసారి సిట్టింగ్ ఎంపీ సోయం బాపూరావు టిక్కెట్ ఆశించారు. మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ కూడా టికెట్ ఆశించిన వారిలో ఉన్నారు. బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరిన మాజీ ఎంపీ గొడం నగేశ్‌కు టిక్కెట్ ఇవ్వడంతో వీరిలో తీవ్ర అసంతృప్తి కనిపించింది. అయితే ఇటీవల ఉట్నూర్‌లో రాథోడ్ రమేశ్‌ను గొడం నగేష్ వ్యక్తిగతంగా కలిసి సహకరించాలని కోరడంతో అసంతృప్తి వీడారనే ప్రచారం సాగింది. కాగా తలమడుగు మండలం ఉండంలో కేంద్ర మంత్రి అర్జున్ ముండా ముఖ్యఅతిథిగా పాల్గొన్న పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్ పాల్గొనడంతో ఆయన కూడా అసంతృప్తి వీడారని అందరు భావించారు. ఇక మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు.. నగేశ్‌కు టికెట్ కన్ఫామ్ అయిన తర్వాత ఎక్కడా పార్టీ కార్యక్రమాల్లో కనిపించలేదు. తాజాగా సోమవారం ఆదిలాబాద్‌లో బీజేపీ తెలంగాణ ఎన్నికల ఇన్‌చార్జి అభయ్ పాటిల్ ముఖ్య అతిథిగా పాల్గొన్న పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఈ ముగ్గురు నేతలు పాల్గొనలేదు. దీంతో పార్టీలో ఏం జరుగుతుందోనని మరోసారి చర్చ మొదలైంది.

కాంగ్రెస్‌లో ఇలా..

కాంగ్రెస్‌లో ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ మొదటి నుంచి టికెట్‌ను ఆశిస్తూ గట్టిగా ప్రయత్నాలు చేశారు. ఏఐసీసీ సభ్యుడు నరేశ్ జాదవ్ పేరు కూడా మొదటి నుంచి ప్రచారంలో ఉన్నప్పటికీ టికెట్ దక్కలేదు. ఇదిలా ఉంటే పార్టీ అభ్యర్థినిగా ఆత్రం సుగుణ పేరు ఖరారు చేసిన తర్వాత ఆమె మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్‌ను వ్యక్తిగతంగా కలిశారు. దీంతో అసంతృప్తి వీడుతారని అందరు భావించారు. అలాగే రేఖానాయక్‌కు పార్టీ పరంగా రాష్ట్రస్థాయిలో నామినేటెడ్ పదవి కల్పించే విషయంలో హామీ లభించిందన్న ప్రచారం కూడా సాగింది. దీంతో ఆమె సుగుణ వెంట ప్రచారంలో పాల్గొంటారని అంతా భావించారు. అయితే ఇప్పటివరకు ఎక్కడ ఆమె సుగుణ వెంట కనిపించింది లేదు. మరోవైపు మంత్రి సీతక్క వచ్చినప్పుడు కూడా నియోజకవర్గ సమావేశాల్లో ఆమె పాల్గొనలేదు. తాజాగా ముఖ్య కార్యకర్తల సమావేశాల్లోనూ ఆమె పాల్గొనకపోవడం గమనార్హం. దీంతో రేఖానాయక్ అసంతృప్తి వీడారా.. లేదా అన్న చర్చ సాగుతోంది. కాగా ఆమె భర్త ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యామ్‌నాయక్ మాత్రం పార్టీ సమావేశాల్లో విస్తృతంగా పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో రేఖానాయక్ పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉన్నారా.. లేనిపక్షంలో ఆమె మౌనం వెనుక కారణమేంటన్న చర్చ సాగుతోంది. ఇక టికెట్ ఆశించిన నరేష్ జాదవ్ ఇప్పటివరకు పార్లమెంట్ నియోజకవర్గ సమావేశాల్లో ఎక్కడా కనిపించలేదు. ఏదేమైనా బీజేపీ, కాంగ్రెస్‌లలో జరుగుతున్న ఈ పరిణామాలపై ఆసక్తి నెలకొంది.

పోస్టల్ బ్యాలెట్.. హోం పోలింగ్

- ఏర్పాట్లపై యంత్రాంగం దృష్టి
- వచ్చే నెల 3 నుంచి 6 వరకు హోం పోలింగ్
- 4 నుంచి 8వరకు పోస్టల్ ఓటింగ్

జిల్లాలో..
ఎన్నికల సిబ్బంది : 4వేలకు పైగా..
దివ్యాంగులు : 6,568 మంది
85 ఏళ్లు పైబడిన ఓటర్లు: 1,902



పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వినియోగించుకుంటున్న ఉద్యోగి (ఫైల్)

కైలాస్‌నగర్: త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించే ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌తో పాటు దివ్యాంగులు, 85 ఏళ్లు పైబడిన వృద్ధుల హోం ఓటింగ్‌పై అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఫారం–12 ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తుండగా, దివ్యాంగులు, వయోవృద్ధులకు ఎన్నికల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఫారం–12డీని అందజేస్తున్నారు. ఈ నెల 23 వరకు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తులు స్వీకరించనున్నారు. అనంతరం వారికి కేటాయించిన తేదీల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఉద్యోగులకు ఎదురైన ఇబ్బందుల నేపథ్యంలో అవి పునరావృతం కాకుండా చర్యలు చేపడుతున్నారు.


ఉద్యోగులకు ఇలా...

ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పోలీసులకు ఈ ఎన్నికల్లో విధులు కేటాయించారు. జిల్లాలోని ఆయా పోలింగ్ కేంద్రాల్లో సుమారు 4వేల మంది విధులు నిర్వహించనున్నారు. వీరికి ఎన్నికల కమిషన్ ముందుగానే ఓటు హక్కు కల్పిస్తోంది. ఈ నెల 1నుంచి 4 వరకు ఎన్నికల నిర్వహణపై అందించిన శిక్షణలో భాగంగా వీరికి పోస్టల్ ఓటింగ్‌పై అవగాహన కల్పించారు. అందరికీ ఫారం–12 అందజేశారు. అందులో ఉద్యోగులు తమ వివరాలను జతచేసి ఎపిక్ కార్డు, ఎలక్షన్‌ఆర్డర్ కాపీతో దరఖాస్తు అందజేయాల్సి ఉంటుంది. మే 4నుంచి 8వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా వీరికి ఓటు వేసే అవకాశం కల్పించనున్నారు. ఉద్యోగులు తమ సొంత నియోజకవర్గంలో ఓటు వేయాలనుకుంటే వారికి ఒక రోజు సెలవు మంజూరు చేస్తారు. ఆ నియోజకవర్గానికి వెళ్లి అక్కడ ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. ఒకవేళ స్థానికంగా విధులు నిర్వహించే చోట ఓటు హక్కు వినియోగించుకోవాలంటే అక్కడ ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో సంప్రదించాలి. ఏఆర్వో (ఆర్డీఓ) కార్యాలయంలోనూ ఓటు హక్కు వినియోగించుకోవచ్చు.

ఇబ్బందులు తొలగేనా...

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల విధుల్లో నియామకమైన ఉద్యోగులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. శిక్షణ సమయంలోనే వారికి పోస్టల్ బ్యాలెట్ ఇస్తామని చెప్పిన అధికారులు అలాంటి చర్యలేమి చేపట్ట లేదు. ఫెసిలిటేషన్ సెంటర్‌కు వచ్చి ఓటు హక్కు వి నియోగించుకోవాలని సూచించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు తమకు కేటాయించిన కేంద్రాలకు హాజరుకాగా జాబితాల్లో చాలా మంది పేర్లు కనిపించలేదు. దీంతో వారంతా ఓటు హక్కు వినియోగించుకోకుండానే వెనుదిరుగాల్సిన పరిస్థితి. మరి కొంతమంది పోస్టల్ బ్యాలెట్ ఇతర జిల్లాల్లోకి పంపించా రు. ఫలితంగా ఓటు హక్కుకు దూరం కావాల్సి వచ్చింది. ఈ సారైనా అలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఇలా...



దివ్యాంగులతో పాటు 85ఏళ్లు పైబడిన వృద్ధులు సైతం ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. ఈసీ నిబంధనల ప్రకారం వీరు ఫారం–12 డి కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. జిల్లాలోని దివ్యాంగులను పరిశీలిస్తే ఆదిలాబాద్ నియోజకవర్గంలో 2,574, బోథ్ నియోజకవర్గంలో 3,994 మంది ఉన్నారు. అలాగే 85 ఏళ్లు పైబడిన వృద్ధులు ఆదిలాబాద్ నియోజకవర్గంలో 898 మంది ఉండగా బోథ్‌లో 1,004 మంది ఉన్నారు. వీరందరికీ గత నెల 16 నుంచి నిర్దేశిత దరఖాస్తు ఫారాల పంపిణీని ప్రారంభించారు. వారి నుంచి ఈ నెల 23వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. అనంతరం ప్రత్యేక బృందాలు వారి ఇళ్లకు వెళ్లి హోం ఓటింగ్ నిర్వహిస్తారు. ఈ బృందాలకు ఈ నెల 19న ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ఈ బృందాలు సందర్శించే తేదీలను బీఎల్‌వోల ద్వారా ఓటర్లకు ఈ నెల 28న సమాచారమందిస్తారు. మే 3 నుంచి 6వరకు ఆయా దరఖాస్తుదారుల ఇళ్ల వద్దకే వెళ్లి హోం ఓటింగ్ నిర్వహిస్తారు. ఈ తేదీల్లో ఎవరైనా తప్పిపోయి ఉంటే తిరిగి 8న మరో విడత వెళ్లి ఓటు హక్కు నమోదు చేయిస్తారు.

రాంజీగోండ్ ఆశయసాధనకు కృషి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన రాంజీగోండ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. మండలంలోని లక్కారం గ్రామంలో రాంజీగోండ్ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ముందుగా రాంజీ చౌక్‌ను ప్రారంభించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాంజీగోండ్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. త్వరలో రాంజీగోండు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి, అదనపు డీఎంహెచ్‌వో మనోహర్, మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు భుజంగ్‌రావు, రాంజీగోండ్ సేవ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విషంరావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

రాంజీగోండ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీ హక్కులు, అభివృద్ధి కోసం బ్రిటీష్ వారితో పోరాడి అమరుడైన రాంజీగోండ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆదివాసీ హీరాసుక జాగృతి సమితి జిల్లా అధ్యక్షుడు సిడాం రాంకిషన్ అన్నారు. మంగళవారం రాంజీగోండ్ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల రాంజీగోండ్ విగ్రహానికి ఆయా పార్టీలు, కార్మిక, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసీల కోసం రాంజీగోండ్ చేసిన పోరాటాలను కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న, జాగృతి సమితి జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణ, కార్యదర్శి మాధవ్, మహిళా అధ్యక్షురాలు గంగాదేవి, ఆనంద్‌రావు, డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాంజీగోండ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

క్లుప్తంగా

అలరించిన అంతర్రాష్ట్ర కుస్తీపోటీలు


కుస్తీపడుతున్న మల్లయోధులు

కుభీర్: మండల కేంద్రమైన కుభీర్‌లో విఠలేశ్వర ఆలయ కమిటీ అధ్వర్యంలో ఉగాది పండగను పురస్కరించుకొని ప్రతీ సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు నిర్వహించారు. ఇందులో నియోజకవర్గంలో పలు గ్రామాల భక్తులతో పాటు మహారాష్ట్రలోని పలు గ్రామాల మల్లయోధులు పాల్గొని కుస్తీలు పట్టారు. మొదటి బహుమతి రూ.6వేలు నవీన్ (హర్యానా) గెలిచారు. రెండవ బహుమతిగా రూ.4వేలను ప్రశాంత్ (పర్బణీ) కై వసం చేసుకున్నాడు. ఆలయ కమిటీ చైర్మన్ బి.పెంటాజీ, మాజీ మండల అధ్యక్షుడు బి.విఠల్, బీజేపీ నాయకులు శేఖర్, ఉప్పు దత్తాత్రి, సాయినాథ్, వి.నాగేష్, కనకయ్య ఇలయ కమిటీ సభ్యులు నాగలింగం, శంకర్, రాజన్న ఉన్నారు.

మే 6నుంచి డిగ్రీ 2,4,6 సెమిస్టర్ పరీక్షలు

కేయూక్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ బీబీఏ బీఏ (ఎల్ఎం)కు సంబంధించిన రెండో, ఆరో సెమిస్టర్ పరీక్షలు మే 6నుంచి, నాలుగో సెమిస్టర్ పరీక్షలు మే 7వ తేదీనుంచి నిర్వహించనున్నట్లు అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలాదేవి ఓ మంగళవారం ప్రకటనలో తెలిపారు. రెండో సెమిస్టర్ పరీక్షలు మే 6, 8, 10, 16, 18, 21, 23, 25 తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నాలుగో సెమిస్టర్ పరీక్షలు మే 7, 9, 15, 17, 20, 22, 24, 27 తేదీల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆరో సెమిస్టర్ పరీక్షలు మే 6, 8, 10, 16, 18, 21, 23, 25, 28, 30, 31, జూన్ 1, 3వ తేదీల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

చివరిచూపునకు నోచుకోకుండా..

- సౌదీలో భైంసావాసి మృతి


మెరాజ్‌ఖాన్(ఫైల్)

భైంసాటౌన్: ఉపాధి నిమిత్తం సౌదీలోని మక్కాకు వెళ్లి అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో భైంసావాసి మృతి చెందాడు. స్థానికులు, కుటుంబీకుల వివరాల ప్రకారం.. పట్టణంలోని నయాబాదికి చెందిన మెరాజ్‌ఖాన్(38) మూడునెలల క్రితం ఉపాధి కోసం సౌదీలోని మక్కాకు వెళ్లాడు. సోమవారం అక్కడ మసీదులో ప్రార్థనల అనంతరం రోడ్డు దాటుతుండగా కారు ఢీకొంది. దీంతో ఈ ఘటనలో మెరాజ్‌ఖాన్ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడున్నాడు. పేద కుటుంబం కావడంతో అక్కడే అంత్యక్రియలు నిర్వహించాలని సూచించినట్లు స్థానికులు పేర్కొన్నారు.

ఇరవై రోజులవుతోంది..

మిషన్ భగీరథ నీటిని వాడని.. బోరిగాంతండా వాసులు

- భగీరథ నీటితో దద్దుర్లు, దురద..
- నీటిలో చెత్తాచెదారం వస్తుందని ఆవేదన
- ఆలయ బోరు వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సిన వైనం


బోరు నుండి నీళ్లు తీసుకొని పోతున్న మహిళలు


వృథాగా వదిలేసిన మిషన్ భగీరథ నీళ్లు

లక్ష్మణచాంద: మన నిత్య జీవితంలో నీరు లేనిది మానవ మనుగడ లేదు. ఉదయం లేచింది మొదలు సాయంత్రం పడుకునే వరకూ ప్రతి పనికి మనిషి నీటిని వినియోగిస్తాడు. ప్రస్తుతం భానుడు భగభగ మండుతున్నాడు. ఎండ తీవ్రతకు ప్రజలు నీటితోనే ఎక్కువ ఉపశమనం పొందుతారు. అయితే మండలంలోని బోరిగాం గ్రామానికి అనుబంధ గ్రామమైన బోరిగాం తండా ప్రజలు మండు వేసవిలో తాగునీటికి తండ్లాట పడుతున్నారు. ఇక్కడి ప్రజలు ఇంటికి.. వంటికి నీటికి కోసం తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. దీనికి కారణం లేకపోలేదు.. మిషన్ భగీరథ నీటిని 20 రోజులుగా వాడడం లేదు. ఆ నీటిని తాగడంతో దురద.. దద్దుర్లు రావడంతో పశువులకు సైతం ఆ నీటిని తాగించడం లేదు. దీంతో నీటి కోసం ఓ చిన్న మోటారు వద్ద పడిగాపులు కాస్తున్నారు.

భగీరథ నీళ్లతో దురద..

మొదట బాగానే వచ్చిన నీళ్లను గ్రామస్తులు వినియోగించారు. కొద్దిరోజుల తరువాత నీళ్లు బాగ లేకపోవడంతో ఆ నీటిని తాగడానికి, స్నానాలకు వినియోగించినప్పుడు గ్రామంలోని చిన్నా,పెద్ద అనే తేడా లేకుండా అందరికి దురద మొదలైంది. ఒంటిపై మొత్తం దద్దుర్లు రావడంతో 20రోజులుగా మిషన్ భగీరథ నీటిని దేనికి వినియోగించడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

రెండు పూటలు బోరునీళ్లే..

గ్రామంలో మొత్తం 60 కుటుంబాలు ఉన్నాయి. ఇక్కడ 250-300 మంది నివాసం ఉంటున్నారు. వీరందరికీ ఆలయం వద్ద ఉన్న ఒకే బోరు నుంచి నీళ్లు తీసుకెళ్తున్నారు. ఉదయం, సాయంత్రం కొందరు బిందెల్లో నీటిని తీసుకెళ్తుండగా మరికొందరు బాటిల్స్ తెచ్చుకుని అందులో నీటిని తీసుకెళ్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టి గ్రామానికి స్వచ్ఛమైన తాగునీరు సరఫరా అయ్యేలాగా చొరవ చూపి ప్రజల ఇబ్బందులు తొలగించాలని తండావాసులు కోరుతున్నారు.

తాగేందుకు వీలులేని భగీరథ నీళ్లు..

మండలంలోని బోరిగాం గ్రామానికి అనుబంధ గ్రామమైన బోరిగాం తండాలో మిషన్ భగీరథ ట్యాంకు ఉంది. దీనికి నిత్యం నీటి సరఫరా అవుతోంది. కానీ ఈ నీటిలో చెత్తాచెదారం, మట్టి, వెంట్రుకలు వస్తున్నాయని, దీంతో మిషన్ భగీరథ నీళ్లు దేనికి వినియోగించుకునే విధంగా లేవని తండావాసులు వాపోతున్నారు.


మురిగా వస్తున్న మిషన్ భగీరథ నీరు


బోరువద్ద నీళ్లు పట్టుకుంటున్న మహిళలు

ఇంటికి.. ఒంటికి బోరు నీళ్లే దిక్కు..

గ్రామంలోని మిషన్ భగీరథ నీళ్లు బాగా లేకపోవడంతో గ్రామంలోని ప్రతి ఇంటికి నిత్యవసరాలకు నీటి కోసం ఇబ్బంది ఏర్పడింది. దీంతో గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద గల బోరుకు పైపు ఏర్పాటు చేసుకొని దాని వద్ద నుంచి గ్రామంలోని అందరు నీటిని తీసుకెళ్తున్నారు. తాగడానికి, స్నానాలకు ఇలా అన్ని రకాల పనులకు ఇక్కడ బోరు నీళ్లే తాగాల్సిన పరిస్థితి. కనీసం గ్రామంలోని పశువులకు కూడా మిషన్ భగీరథ నీళ్లను వినియోగించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. దీంతో గంటల తరబడి నీటి కోసం వేసి చూడాల్సిన దుస్థితి నెలకొందని స్థానికులు అంటున్నారు.

సమాకకు సరఫరా కానీ 'భగీరథ'

- వ్యవసాయ బావుల నుంచి నీటిని తెచ్చుకుంటున్న ఆదివాసీలు


భగీరథ సంపు నుంచి నీటిని తోడుతున్న సమాక గిరిజనులు

ఇంద్రవెల్లి: మండలంలోని సమాక గ్రామానికి వారం రోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో ఆ గ్రామస్తులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామంలో 126 ఆదివాసీ గిరిజన కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వారం రోజులుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కారణంగా మిషన్ భగీరథ సంపు నుంచి నీటి సరఫరాను నిలిపివేశారు. దీంతో గ్రామస్తులు వ్యవసాయ బావులు, బోరుబావుల నుంచి ఎడ్లబండ్లు, బిందెలతో నీటిని తీసుకొచ్చుకుంటున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా కింద స్థాయి సిబ్బంది నీటిని సరఫరా చేయడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి తమ గ్రామానికి ప్రతీ రోజు మిషన్ భగీరథ నీరు వచ్చేలా చూడాలని కోరుతున్నారు.


బావి నుంచి ఎడ్ల బండ్లు, బిందెలతో నీటిని తీసుకెళ్తున్న సమాక గిరిజనులు

ఇబ్బందిగా ఉంది..


గ్రామంలోని మిషన్ భగీరథ నీళ్లు మంచిగ వస్తలేవు. దీంతో బోరు నుంచి అందరు ఒకేసారి తెచ్చుకోవడంతో అక్కడ నీళ్ల కోసం పడిగాపులు పడాల్సి వస్తుంది. తాగడానికి, స్నానాలకు అన్నింటికి ఇక్కడ నుంచే నీటిని తీసుకుపోవడం ఇబ్బందిగా ఉంది.

– రాథోడ్ లత, బోరిగాం తండా

దురద వస్తుంది


గ్రామంలోని మిషన్ భగీరథ నీళ్లు తాగినా, స్నానాలు చేయడానికి వినియోగించినా తమకు, పిల్లలకు దద్దుర్లు వస్తున్నాయి. దీంతో ఆ నీటిని వాడుతలేం. బోరు వద్ద నీటిని తీసుకొని వస్తున్నాం. అధికారులు స్పందించాలి.

– జాదవ్ పద్మ, బోరిగాం తండా

స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలి


తమ గ్రామానికి తాగునీటిని సరఫరా చేసే మిషన్ భగీరథ నీళ్లు మంచిగ రావడం లేదు. దీంతో బోరు నీళ్లపై ఆధారపడాల్సి వస్తోంది. అధికారులు వెంటనే స్పందించి స్వచ్ఛమైన తాగునీరు సరఫరా అయ్యేలాగా చర్యలు చేపట్టాలని కోరుతున్నాం.

– ప్రేమ్‌సింగ్, బోరిగాం తండా

చర్యలు చేపడుతాం

మండలంలోని బోరిగాం తండాకు వెళ్లి ట్యాంకును పరిశీలించి స్వచ్ఛమైన మంచి నీళ్లు గ్రామానికి సరఫరా అయ్యేలాగా తగిన చర్యలు వెంటనే చేపడుతాం. తాగునీటికి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తాం. – రాజశేఖర్‌రెడ్డి, ఏఈ, మిషన్ భగీరథ

నగదు సీజ్


తనిఖీ చేపడుతున్న ఎఫ్ఎస్‌టీ అధికారులు

జైనథ్: మండలంలోని ఫౌజ్‌పూర్ వద్ద రూ.96,500 నగదును సీజ్ చేసినట్లు ఎఫ్ఎస్‌టీ అధికారి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం జాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహిస్తుండగా బేల మండలం టాక్లీ నుంచి మహారాష్ట్రలోని దహేగావ్‌కు కార్‌లో వెళ్తున్న కిరణ్ పరమేశ్వర్ అనే వ్యక్తి వద్ద రూ. 1,96,500 నగదు లభించినట్లు ఆయన తెలిపారు. ఈ నగదుకు సంబంధించిన ఎలాంటి పత్రాలు లేకపోవడంతో డబ్బును సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రూ.77వేల నగదు స్వాధీనం

భైంసాటౌన్: ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.77వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ రాజారెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక బొర్ర గణేశ్ మందిర్ వద్ద వాహన తనిఖీలు చేపడుతుండగా, పట్టణానికి చెందిన ఎండీ ఫైజుల్లాఖాన్ అనే వ్యక్తి ఎన్నికల నిబంధనావళికి విరుద్ధంగా నగదు తరలిస్తూ పట్టుబడ్డాడు. అతడి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

గుడిహత్నూర్: మండలంలోని జాతీయ రహదారి 44పై దేవాపూర్ చెక్‌పోస్టు సమీపంలో మంగళవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో జిల్లా కేంద్రానికి చెందిన అక్షయ్ తీవ్రగాయాల పాలయ్యాడు. పోలీసులు తెలిపిన ప్రకారం... అక్షయ్ తెల్లవారు జామున సుమారు 3గంటల ప్రాంతంలో జాతీయ రహదారిపై రాంగ్‌రోట్లో తన కారులో ఆదిలాబాద్ వైపు వెళ్తుండగా కారు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో అక్షయ్ తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు.

'ఆదిలాబాద్ ఎంపీ స్థానం బీజేపీదే'

బజార్‌హత్నూర్: ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం బీజేపీ పార్టీదేనని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ తెలిపారు. మంగళవారం ధరంపురి, ఏసాపూర్, మోర్కండి, గులాబ్ తాండ, అనంతపూర్, హర్కయి, టెంబి మంజరంతండా గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ మేకల వెంకన్న యాదవ్, మండల అధ్యక్షుడు బత్తిని సుధాకర్, కేవల్‌సింగ్, పెరుగు సంతోష్, అల్కే గణేష్, నానం రమణ, కొత్త శంకర్, నందినర్సయ్య, భోజరెడ్డి, సంతోష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వాంతులు చేసుకుని చిన్నారి మృతి

- నెలరోజుల క్రితం గుండెకు సంబంధించిన ఆపరేషన్
- రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి
- పండుగపూట కైలాస్‌నగర్‌లో విషాదం


శృతిలయ మృతదేహం

ఇంద్రవెల్లి: వాంతులు చేసుకుని చిన్నారి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందిన సంఘటనతో మండలంలోని హర్కపూర్ అంద్‌గూడ గ్రామపంచాయతీ పరిధిలోని కైలాస్‌నగర్‌లో విషాదం నెలకొంది. కుటుంబీకుల వివరాల ప్రకారం... డాకురే రాము, మంజుల దంపతులకు శృతిలయ(6), మూడేళ్ల పృతిరాజ్ ఉన్నారు.నెల రోజుల క్రితం శృతిలయ అనారోగ్యానికి గురికాగా కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు గుండెలో నరం బ్లక్ అయిందని, ఆపరేషన్ చేయాలని తెలిపారు. వైద్యులు సూచనల మేరకు వెంటనే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి ఆపరేషన్ చేయించారు. దీంతో నెల రోజులుగా చిన్నారి ఆరోగ్యంగానే ఉంది. మంగళవారం తెల్లవారు జామున వాంతులు చేసుకోవడంతో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించి మృతి చెందింది. ఉన్న ఏకైక కూతురు మృతి చెందడంతో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి.

సాంగ్విలో హైటెక్ ఇసుక తవ్వకాలు

- మూడు జేసీబీలు, బోట్ సహాయంతో తవ్వకాలు
- తవ్వకాల కోసం పెన్‌గంగలో ప్రత్యేక దారి


పెన్‌గంగలో కృత్రిమంగా ఏర్పాటు చేసినదారి


పెన్‌గంగలో ఏర్పాటు చేసిన బోట్

జైనథ్: మండలంలోని సాంగ్వి గ్రామ సమీపంలోని పెన్‌గంగ నదిలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. కొన్ని రోజులుగా గుట్టుచప్పుడు కాకుండా ఇసుక తవ్వకాలు, రవాణా చేపడుతుండగా ప్రస్తుతం ఏకంగా జేసీబీలతో తోడేస్తున్నారు. దీనికి తోడు మహారాష్ట్ర నుంచి ప్రత్యేకంగా తెప్పించిన బోట్‌ను వాడి నది నీళ్లలోంచి ఇసుక బయటకు తీస్తున్నారు. బ్యాటరీలు, జనరేటర్ బిగించిన ప్రత్యేకమైన బోట్‌తో సునాయాసంగా నీళ్ల నుంచి ఇసుక వేరు చేస్తూ జేసీబీలతో కుప్పలు పోస్తున్నారు. అనంతరం రాత్రి వేళ లారీల్లో ఇసుక లోడ్‌ను నింపి ఆదిలాబాద్‌తో పాటు మహారాష్ట్రకు సైతం రవాణా చేస్తున్నారు.

రంగంలోకి దిగిన పోలీసులు

జేసీబీలు, బోట్‌లతో హైటెక్ ఇసుక తవ్వకాలు చేపడుతున్న సమాచారం అందడంతో జైనథ్ సీఐ సాయినాథ్ ఆదేశాల మేరకు ఎస్సై పురుషోత్తం సిబ్బందితో కలిసి సాంగ్వి వద్ద దాడులు చేపట్టారు. పెన్‌గంగలోని మూడు జేసీబీలు, ఒక బోట్‌ను గుర్తించి మైనింగ్, రెవెన్యూ, ఆర్టీఏ అధికారులకు తదుపరి చర్యల కోసం సమాచారం అందించారు. మూడు జేసీబీలతో పాటు బోట్‌ను సైతం సీజ్ చేసి జరిమానా వేస్తామని ఆయన తెలిపారు. అక్రమ ఇసుక దందా ఎవరూ నిర్వహించినా ఉపేక్షించబోమని, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బెల్ట్‌షాపులపై పోలీసుల దాడులు


పట్టుబడ్డ మద్యం బాటిళ్లతో పోలీసులు

సారంగాపూర్: మండలంలోని జామ్ గ్రామంలో మంగళవారం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పోశెట్టి అనే వ్యక్తిని పట్టుకున్నట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఆయన వద్ద నుంచి రూ.9వేల విలువైన మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మద్యం పట్టివేత..

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులపై మంగళవారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించి రూ.5400 విలువ గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దుబ్బక సునీల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అక్రమంగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా అసాంఘిక చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ అఫ్సర్ ఉన్నారు.


ఇంద్రవెల్లి: మద్యం బాటిళ్లను చూపుతున్న ఎస్సై

ఇద్దరిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని జందాపూర్, బంగారుగూడలలో నిర్వహిస్తున్న బెల్టు షాపులపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. ఎస్సై ముజాహిద్ వివరాల ప్రకారం.. ఎన్నికల్లో భాగంగా జందాపూర్ గ్రామంలో కొప్పరి ప్రభాకర్, బంగారుగూడలో దార్ల పవన్ బెల్టుషాపు నిర్వహిస్తుండగా పట్టుకుని ఒక్కొక్కరి నుంచి లీటర్నర మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. మండలంలో ఎవరైనా అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాంటి వారు ఉంటే తమకు సమాచారం అందించాలని తెలిపారు.

కుంటాలలో వర్షం


ధాన్యంపై కవర్లు కప్పి ఉంచిన రైతులు

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం వేకువజామున ఉరుముల మెరుపులతో కూడిన వర్షం కురిసింది. విక్రయించేందుకు కల్లాల్లో పోసిన మొక్కజొన్న తడవ కుండా రైతులు టార్పాలిన్ కప్పి ఉంచారు. దీంతో ధాన్యం తడవలేదు. ఇక వర్షంతో మండలంలో వాతావరణం చల్లబడింది.

గాలివానకు తెగిన విద్యుత్ తీగలు

కుభీర్:మండల కేంద్రంలో మంగళవారం తెల్లవారుజామున ఈదుర గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరాను నిలిపి వేశారు. గాలుల ధాటికి రెండు స్తంభాల తీగలు తెగిపడ్డాయి. దీంతో వెంటనే విద్యుత్ అధికారులు స్తభాలను సరిచేసి తీగలను ఏర్పాటు చేసి సరఫరా పునరుద్ధరించారు.

ఎస్సారెస్పీని సందర్శించిన ఎమ్మెల్యే బొజ్జు


ఎస్సారెస్పీ వద్ద ఎమ్మెల్యే, డీసీసీ, ఎంపీ అభ్యర్థి

ఖానాపూర్: నిజామాబాద్ జిల్లా శ్రీరాంసాగర్ జలాశయాన్ని సోమవారం రాత్రి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో పాటు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరిరావు, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ సందర్శించారు. నిర్మల్ జిల్లాలోని సదర్మాట్, సరస్వతి కాలువల పరిధిలో రైతాంగానికి యాసంగి పంటకు సరిపడా సాగునీటిని అందించాలని అధికారులను కోరారు. ఎమ్మెల్యే వెళ్లిన సమయంలో అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఈ విషయాన్ని ఫోన్‌లో తెలిపారు. పంటలు ఎండిపోయే ప్రమాదం ఉన్నందున నీటిని విడుదల చేయాలని కోరగా అధికారులు సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు.

ప్రత్యేకం మరాఠీల 'గుడిపాడ్వా'



గుడిహత్నూర్: హిందూ సంవత్సరాది ఉగాదిని పురస్కరించుకొని మండలంలోని మరాఠీలు చేసుకున్న పండుగ 'గుడిపాడ్వా' ప్రత్యేకంగా నిలిచింది. ఉదయాన్నే వాకిళ్లను శుద్ధి చేసి రంగుల ముగ్గులు వేసి వాకిట్లో ఓ కొత్త కర్రకు చీరను కట్టి, దానిపై కలశ ముంతను బోర్లేసి పూలమాలలు వేసి ఆ కర్రను పీఠపై ఉంచి నిలదీశారు. ఇలా సాయంత్రం వరకు ఉంచి పూజలు చేశారు. కొత్త ఏడాది ప్రారంభం రోజున ఇలా తమ సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలకడం అనాధిగా వస్తున్న ఆచారాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. కాగా ఊరంతా ఇలా చేయడంతో ప్రత్యేక జెండాలు ఆవిష్కరించినట్లుగా నిలిచింది మరాఠీల 'గుడిపాడ్వా'.